www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 14 జనవరి 2024
5
పశ్చిమ గోదావరి

పాడి పంటల పండుగ సంక్రాంతి

కలెక్టర్ పి.ప్రశాంతి

మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ సంక్రాంతి. ఇది పల్లెల పండుగ, రైతుల పండుగ, మన పాడి పంటల పండుగగా సంక్రాంతి నిలుస్తుంది. కుటుంబ, సాంస్కృతిక మూలాలకు విలువనిచ్చే పెద్ద పండుగ సంక్రాంతి. భోగి మంటలు, రంగవల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్లు, రైతు లోగిళ్లలో ధాన్యం రాశులు, పిండి వంటలు, బంధుమిత్రుల సందడి సంక్రాంతి. జిల్లాలోని ప్రతి ఇంటిలో సిరులు వెల్లివిరియాలి.

కాళ్ల మండలం పెదఅమిరంలో కోడిపందేలకు సిద్ధమైన బరి

కోడి పందేలకు

సై..సై..!

- రెండు జిల్లాల్లోనూ బరులు సిద్ధం
- నేడు 11 గంటల తర్వాత కొనసాగనున్న పందేల జోరు
- పండుగ మూడు రోజులు ఇక రక్తసిక్తమే
- బరుల ప్రాతిపదికన పోలీసులకు మాముళ్లు
- తూతూమంత్రంగా బరులు ధ్వంసం
- గుండాట, మూడు ముక్కలాటలకు సైతం అనుమతి!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కోడి పందేలకు పందెంరాయుళ్లు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ఆదివారం భోగి రోజు ఉదయం 11 గంటల తర్వాత పందేల జోరుకు అంతా సై..సై అంటూ కేరింతలు కొడుతున్నారు. బరుల ధ్వంసం, కోడిపందేలను అడ్డుకుంటామంటూ బీరాలు పలికిన అధికార యంత్రాంగం పండుగ మూడు రోజులు ప్రేక్షకపాత్రకు పరిమితం కానుందని స్పష్టంగా తెలుస్తోంది. దీంతో ఈ ఏడాదీ రెండు జిల్లాల్లోనూ పందేల జోరు యథాతథంగా సాగనున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కోడి పందేలకు పందెంరాయుళ్లు సిద్ధమయ్యారు. ఇప్పటికే బరులకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. ట్రాక్టర్లతో చదును చేయించి, టెంట్లు వేయడం వంటి అన్ని పనులూ పూర్తయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో పెదఅమిరం, సీసలి, ఆకివీడు మండలం కుప్పనపూడి, పాలకొల్లు మండలం పూలపల్లి, యలమంచిలి మండలం కలగంపూడి, తాడేపల్లిగూడెం, తణుకు వంటి పలు మండలాల్లో కోడి పందేల బరులు కొనసాగనున్నాయి. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు, నారాయణపురం, బాదంపూడి, భీమడోలు మండలంలో గుండుగొలను, ఆగడాలలంక, పెదవేగి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లోనూ పెద్దఎత్తున పందేల నిర్వహణకు పందెంరాయుళ్లు సమాయత్తమయ్యారు. ప్రతి మండలంలోనూ పెద్ద, చిన్న కలుపుకుని పది వరకూ బరులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. రెండు జిల్లాల్లోనూ దాదాపు 400కు పైగా బరుల్లో కోడిపందేలు సాగనున్నాయని స్పష్టమవుతోంది. ఇప్పటికే భీమవరంతోపాటు ఏలూరు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు వంటి పట్టణాల్లో హోటల్ రూమ్ నిండుకున్నాయి. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి కూడా పందెంరాయుళ్లు ఆదివారం జిల్లాకు రానున్నారు. భోగి రోజు ఉదయం పది గంటల వరకూ పోలీసుల హడావుడి ఉంటుందని, తర్వాత పందేలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని పందెంరాయుళ్లు ధీమాగా ఉన్నారు. బైండోవర్ కేసులు, బరుల ధ్వంసం వంటి కార్యక్రమాలన్నీ కోర్టుకు చూపించడానికి తప్ప, పందేలు ఆపేందుకు కాదని పందెంరాయుళ్లు ఢంకాబజాయించి చెబుతున్నారు. బరుల వద్ద గుండాట, పేకాటకు సంబంధించి శనివారం సాయంత్రం వరకూ అనుమతులు రాలేదు. పందేలు ప్రారంభమయ్యే సమయానికి వాటికి అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిసింది. పెద్ద బరుల వద్ద రాత్రీ పగలు నిరంతరాయంగా పందేలు సాగించేందుకు ఫ్లడ్‌లైట్లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. పందెం మూడు రోజులు రూ.కోట్లలో సొమ్ము బెట్టింగ్ రూపంలో చేతులు మారనుంది. అమాయక ప్రజానీకం మరోసారి కోడిపందేలకు ఆకర్షితులై జేబులు గుల్ల చేసుకునే పరిస్థితి నెలకొంది.

మాముళ్లు ఇచ్చుకోండి.. పందేలు వేసుకోండి..!

పందేలను అడ్డుకుంటామంటూ హెచ్చరికలు చేస్తున్న పోలీసులు.. పందెంరాయుళ్లకు మాత్రం తమ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చేసినట్లు తెలిసింది. పెద్ద బరులకు రూ.లక్ష, ఓ మోస్తరు బరికి రూ.70 వేలు, మిగిలిన వాటికి బరుల ప్రాతిపదికన ధరలు నిర్ణయించి వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో కొద్దిరోజుల్లో పోలీసు అధికారులంతా బదిలీలు కానున్నారు. ఇదే అదునుగా వచ్చినకాడికి దండుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. పలుచోట్ల పోలీసు అధికారులే కబుర్లు పంపించి పందేలు వేసుకోండంటూ చెబుతున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో పందెంరాయుళ్లు మరింత రెచ్చిపోతున్నారు. పండుగ మూడు రోజులు పందేలకు అడ్డూఅదుపు లేకుండాపోయే పరిస్థితి కనిపిస్తోంది. హైకోర్టు ఆదేశాలు ఎప్పటికి అమలయ్యేనో అని ప్రజానీకం ఎదురుచూడక తప్పని పరిస్థితి ఉంది.

చాట్రాయి మండలం పర్వతాపురంలో కోడిపందేలకు సిద్ధమైన బరి

వైసిపి ఎంపీ రఘురామకృష్ణంరాజుకు

టిడిపి, జనసేన పోటాపోటీ స్వాగతం

అభివాదం చేస్తున్న ఎంపీ రఘురామకృష్ణంరాజు, పక్కనే ఉండి మాజీ ఎంఎల్‌ఎ శివ, ఇతర నేతలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్, పెనుగొండ, పాలకొల్లు

ఎన్నికలు సమీపిస్తున్న వేళ నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామ కృష్ణంరాజు ఎట్టకేలకు సుమారు నాలుగేళ్ల అనంతరం సొంత నియోజకవర్గంలో అడుగుపెట్టారు. అయితే ఆయనకు టిడిపి, జనసేన నేతలు పోటాపోటీగా స్వాగతం పలుకడం సర్వత్రా చర్చనీయాంశమైంది. గతంలో టిడిపి, బిజెపి తరపున రెండు నామినేషన్లు వేసి అందరి దృష్టిని ఆకర్షించిన రఘురామకృష్ణంరాజు ఈసారి ఎన్నికల్లో నరసాపురం సీటు పొత్తులో ఏ పార్టీకి దక్కినా తన పోటీకి ఇబ్బంది లేకుండా రెండు పార్టీల అధినేతలతో సత్సంబంధాలు సాగిస్తున్నారా అనే అనుమానాలు మొదలయ్యాయి. జిల్లాలో అడుగుపెడుతూనే మళ్లీ నరసాపురం నుంచి తాను పోటీకి సిద్ధంగా ఉన్నానని చెప్పడం ఈ అనుమానాలకు మరింత ఊతమిస్తోంది.

ఎంపీ రాజమండ్రి ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గంలో సిద్దాంతం వద్ద జిల్లాలోకి ప్రవేశించారు. అక్కడ టిడిపి, జనసేన నేతలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి పాలకొల్లు, వీరవాసరం మీదుగా భీమవరంలోని తన నివాసానికి చేరుకున్నారు. సుమారు నాలుగేళ్లుగా నియోజకవర్గానికి దూరంగా ఉన్న ఆయన కొంతకాలంగా అభివృద్ధి కార్యక్రమాల్లో తన ప్రతినిధిగా తన కుమారుడు భరత్‌ను రంగంలోకి దింపి పంపుతున్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆయనే నేరుగా పోటీ చేస్తారా లేక కుమారుడిని బరిలోకి దింపుతారా అనే చర్చ కూడా పెద్దఎత్తున సాగుతోంది. రఘురామకృష్ణంరాజుకు స్వాగతం పలికిన వారిలో టిడిపి ఎంఎల్‌సి నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, టిడిపి నాయకులు మెంటే పార్థసారధి, కోళ్ల నాగేశ్వరరావు, కొత్తపల్లి నాగరాజు, జనసేన నాయకులు బొమ్మిడి నాయకర్, చేగొడి సూర్యప్రకాష్ తదితరులు ఉన్నారు.

జూదాలు అరికట్టాలని సిపిఎం వినతి



వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఇరగవరం

మండలంలో కోడి పందేల వల్ల ప్రజలు ఆర్థికంగా నష్టపోతారని, కోడిపందేలు, జూదాలు ఆరికట్టాలని సిపిఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి కోరారు. శనివారం సిపిఎం ఆధ్వర్యాన స్థానిక పోలీస్ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ సంప్రదాయం పేరుతో కోడిపందేలు, యథేచ్ఛగా జూదం సరికాదని అన్నారు. వీటిని ఆరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నేతలు ఇల్లింద్రపర్తి సత్యనారాయణ, నీలాపు ఆంజనేయులు పాల్గొన్నారు.

నేటి నుంచి డివైఎఫ్ఐ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

క్రీడా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్న కార్యకర్తలు

ప్రజాశక్తి - ఆకివీడు

సంక్రాంతి ఆటల పోటీలు అంటే అందరికీ గుర్తొచ్చేది ఆకివీడు. యువత సంక్రాంతి సందర్భంగా జూదాలు, వ్యసనాల బారిన పడకుండా ఉండేలా దశాబ్దాలుగా ఇక్కడ డివైఎఫ్ఐ ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడమే ఆకివీడుకు ఆ ప్రత్యేకతను తీసుకొచ్చింది.

ముస్తాబైన క్రీడా ప్రాంగణం

ప్రతియేటా మాదిరిగానే ఈ ఏడాది పోటీల నిర్వహణకు క్రీడా ప్రాంగణం ముస్తాబవుతోంది. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో నిర్మించే క్రీడాప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మొత్తం నాలుగు బ్లాకులుగా ఏర్పాటు చేసి రెండింటిలో చెడుగుడు, మరో రెండింటిలో వాలీబాల్ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోటీలను వీక్షించేందుకు ప్రేక్షకులకు అనువుగా ప్రత్యేక గ్యాలరీ సిద్ధం చేస్తున్నారు. వీటితోపాటు విఐపిలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం వారం రోజులుగా హైస్కూల్ క్రీడా ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ప్రస్తుతం ప్రాంగణమంతా డివైఎఫ్ఐ జెండాలతో అలంకరిస్తున్నారు. ఈ క్రీడాప్రాంగణంలో రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు, కృష్ణా, గోదావరి జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. చెస్, పాటల పోటీలతోపాటు పట్టణంలో పలుచోట్ల ముగ్గుల పోటీలు ఐద్వా ఆధ్వర్యాన కూడా నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం పోటీలు ప్రారంభ సభ జరగనుంది. రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 17న బుధవారం రాత్రి పోటీల ముగింపు సభ జరగనుంది.

ఆసుపత్రి పనులు వెంటనే పూర్తి చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

నినదిస్తున్న నేతలు, గ్రామస్తులు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఎల్‌బి.చర్లలోని పెదపట్నపు వెంకటస్వామి, చల్లాలమ్మ ప్రభుత్వాసుపత్రి మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేసి పున:ప్రారంభించాలని, మంజూరైన మెడికల్ ల్యాబ్ పనులను వెంటనే చేపట్టాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ సంవత్సరం క్రితం ఆసుపత్రి మరమ్మతు పేరుతో పక్కనే ఉన్న లేసు భవనంలోకి మార్చారన్నారు. అయితే అక్కడ రోగులకు కనీస సౌకర్యాలు లేవని, గర్భిణులకు ఈ భవనం హాలులోనే ప్రసవాలు చేయడం బాధాకరమని అన్నారు. ఈ ఆసుపత్రి సుమారు 50 వేల మంది జనాభాకు వైద్యం అందిస్తుందని తెలిపారు. తక్షణం పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురాకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాటాల ధనంజయ, తిరుమని సత్యనారాయణ, గుండుబోగుల వెంకటరమణ, పొన్నాల కొండయ్య, వడ్లమన్నాటి చిరంజీవి, కైలా మోహన్‌రావు, కడలి భార్గవ్, మామిడిచెట్టు గుణశేఖర్, బొక్కా అనిల్, కుక్కల నరేంద్ర, తిరుమలశెట్టి గగనవీరుడు, తిరుమలశెట్టి మారాజు, కొప్పర్తి రాజు, కైలా సుబ్బారావు పాల్గొన్నారు.

పటిష్టంగా ఏటిగట్టు నిర్మాణం

గోదావరి గట్టు కుంగిన ప్రదేశాన్ని పరిశీలించిన చీఫ్ విప్ ప్రసాదరాజు

ఏటిగట్టును పరిశీలిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

అవినీతికి, అక్రమాలకు తావు లేకుండా పటిష్టంగా ఏటిగట్టు నిర్మిస్తామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణ పరిధి పొన్నపల్లి ఏటిగట్టు కుంగిన ప్రదేశాన్ని ఆయన శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.26 కోట్ల నిధులతో చేపట్టిన ఏటిగట్టు పటిష్ట పనులు 60 శాతం మాత్రమే జరిగాయని, ఇంకా 40 శాతం జరగాల్సి ఉన్నాయని చెప్పారు. ఇప్పటికీ ఒక్క రూపాయి బిల్లు కూడా రాలేదన్నారు. పనులు పూర్తి కాకుండానే అవినీతి జరిగిందని కొంతమంది అనటం భావ్యం కాదన్నారు. వరదల సమయంలో ఏటిగట్టు కోతకు గురై ప్రమాదభరితంగా ఉండటంతో అత్యవసర పనుల్లో భాగంగా యుద్ధ ప్రాతిపదికన గట్టు పటిష్ట పనులు చేపట్టినట్లు చెప్పారు. ఈ పనులకు అంచనా విలువ రూ.26 కోట్లు అని, ఇవి సరిపోకపోతే మరిన్ని నిధులు సమకూర్చి ఏటి గట్టును మరింత పటిష్టంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ పనుల్లో భాగంగా ఏటిగట్టు ఇప్పటికీ మూడుసార్లు కుంగిందని, గట్టు కుంగడం వల్ల వేసిన రాళ్లు సర్దుకుంటాయని వివరించారు. గట్టు కుంగిన ప్రదేశంలో 60 అడుగులకు పైగా లోతు ఉందని, లోతుకు తగ్గట్లుగా పటిష్ట పనులు చేపట్టి రీవిట్‌మెంట్ వాల్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. 60 అడుగుల లోతును అంచెలంచెలగా పూడ్చుతూ మెట్లు మాదిరిగా పని చేపడతారన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణ, జయరాజు, నరసాపురం సొసైటీ అధ్యక్షులు షేక్ బుల్లి మస్తాన్, పార్టీ పట్టణ అధ్యక్షులు భూసారపు జయప్రకాష్, రెడ్డప్ప దవేజి, మల్లాడి బుజ్జి, వల్లభుని శేఖర్, చిట్టూరి కృష్ణ, కేసరి గంగరాజు, కావలి నాని, సోమరాజు దుర్గాభవాని, పతివాడి పద్మ, సంబంధిత శాఖాధికారులు ఉన్నారు.

నేడు రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

ప్రజాశక్తి - ఆకివీడు

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి యువజన ఉత్సవాల్లో భాగంగా జరిగే ఆటల పోటీల్లో ఆదివారం రాత్రి రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలు స్థానిక దొరగారి చెరువు వద్ద జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నిర్వహించే ఈ పోటీల్లో మెన్స్ ఫిజిక్ ఛాంపియన్ షిప్, మిస్టర్ ఆంధ్ర ఛాంపియన్ షిప్ పోటీలు జరుగుతాయని తెలిపారు.

ప్రభుత్వ తాటాకు చప్పళ్లకు భయపడం

33వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారంతో 33వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం బెదిరించే తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదని అంగన్‌వాడీలు చెప్పారు. ఎస్మా జిఒ కాపీలను భోగి మంటల్లో వేసి దహనం చేసి నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించేవరకూ సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు.

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో అంగన్వాడీలు చెవులు, కళ్లు, నోరు మూసుకుని నిరసన తెలిపారు. అనంతరం సమ్మె శిబిరం వద్ద నుంచి ర్యాలీగా ప్రకాశం చౌక్ సెంటర్ వరకు వెళ్లి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రాయ్, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు దుర్గ, వెంకటలక్ష్మి, శాంతకుమారి, ప్రసన్న, సావిత్రి, సిఐటియు మండల కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకోడేరు : ప్రభుత్వం బెదిరించే తాటాకు చప్పళ్లకు భయపడేదే లేదని పాలకోడేరు అంగన్వాడీలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పాలకోడేరులో అంగన్‌వాడీలు తాటాకులతో నిరసన తెలిపారు. సమ్మె శిబిరన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ సందర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు విజయలక్ష్మి, విమలకుమారి, విమల, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పెంటపాడు : అంగన్‌వాడీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే పెద్దఎత్తున సంతకాల సేకరణ చేసి ప్రభుత్వ మొండి వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని సిఐటియు నాయకులు సిరపరపు రంగారావు, బంకురు నాగేశ్వరరావు, అంగన్‌వాడీ మండల నాయకులు ఆర్.అనురాధ, వి.కనకమహాలక్ష్మి, జి.జయలక్ష్మి అన్నారు. పెంటపాడులో సమ్మె శిబిరం వద్ద వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సభ్యులు దుర్గ పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : పెనుమంట్ర తహశీల్దార్ కార్యాలయం సమ్మె శిబిరం వద్ద ఎస్మా జిఒ కాపీలను భోగి మంటలో వేసి దహనం చేసి నిరసన తెలిపారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీల మండల కార్యదర్శి వి.సరస్వతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్, అంగన్వాడీ అధ్యక్షరాలు సాయి మహాలక్ష్మి, మౌనిక, కార్మికులు శాంతికుమారి, జ్యోతి, టిఎల్‌డి.భవాని, సుజాత కుమారి, డి.కల్యాణి సుధ పాల్గొన్నారు.

తణుకులో...

ఆచంట : ఆచంట కచేరి సెంటర్‌లో అంగన్‌వాడీలు ఎస్మా కాపీలను భోగి మంటల్లో వేసి దహనం చేసి నిరసన తెలిపారు. సమ్మెకు సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ జిల్లా ఉపాధ్యక్షులు వైట్ల ఉషారాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు మైలే విజయలక్ష్మి, శ్రీదేవి, పుడక నాగలక్ష్మి, కమల, పద్మ, సుజాత, కనకదుర్గ, ధనలక్ష్మి, రజిని, మేరీ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెంలో అంగన్‌వాడీలు చిన్న పిల్లలకు రేగుపండ్లు అందించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షరాలు దీన స్వరూపారాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కమిటీ నాయకులు యడవల్లి వెంకట దుర్గారావు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం వద్దకు సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు వచ్చి మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సభ్యులు దీన స్వరూపరాణి, ప్రభారాణి, కనకమహాలక్ష్మీ, వరలక్ష్మి, ప్రసన్న, గాయత్రి, వీరమ్మ, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, యడవల్లి వెంకట దుర్గారావు పాల్గొన్నారు.

కాళ్ల : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మె శిబిరం వద్ద సిఐటియు మండలాధ్యక్షులు గొర్ల రామకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ఝాన్సీ రాణి, రాజేశ్వరి, మార్తమ్మ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : స్థానిక అంబేద్కర్ కూడలిలో ఎస్మా జిఒ కాపీలను భోగి మంటల్లో దహనం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కె.సత్యవతి, వెంకటలక్ష్మి, నీలిమ పాల్గొన్నారు.

పాలకోడేరులో...

గణపవరం : గణపవరంలో అంగన్వాడీలు ఎస్మా జిఒ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మండల కమిటీ నాయకులు బి.రామకోటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు కెవి.సీతామహాలక్ష్మి, ధనలక్ష్మి, బండారు మహాలక్ష్మి, బండారు పార్వతి, ఎస్.జయలక్ష్మి, కల్యాణి పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులో దీక్షా శిబిరం వద్ద భోగి మంటలో ఎస్మా జిఒ కాపీలు వేసి దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, అంగన్వాడీలు పెద్దింట్లు, సారమ్మ, నాగలక్ష్మి, రేఖ శాంభవి పాల్గొన్నారు.

యలమంచిలిలో...

ఇరగవరం : మండల కేంద్రమైన ఇరగవరంలో దీక్షా శిబిరం ఎదుట భోగి మంటలు వేసి ఎస్మా జిఒ కాపీలను దహనం చేశారు. భోగి మంటల చుట్టూ తిరుగుతూ అంగన్వాడీ కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పాటలు పాడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎ.అజయకుమారి, కార్మికులు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : స్థానిక కోర్టు వద్ద ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అడ్డగర్ల అజయకుమారి, జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడారు. ప్రముఖ న్యాయవాదులు, పౌర హక్కుల నాయకులు కౌరు వెంకటేశ్వర్లు, అనుకుల రమేష్, కె.యాకోబు, కె.ఆనంద్‌కుమార్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గార రంగారావు, కనకదుర్గ, వసంత కుమారి, మంగ తాయారు, ప్రమీల, ధనలక్ష్మి, రజని, రాజకుమారి పాల్గొన్నారు.

ఆకివీడు : సమ్మె శిబిరం వద్ద అంగన్‌వాడీలు ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండలాధ్యక్షులు పింకీ అప్పారావు, కృష్ణకుమారి, జి.పైడేశ్వరి, కృష్ణవేణి, భాను, భవాని, అమ్మాజీ, మీసాల లక్ష్మి, ఇరానీదేవి పాల్గొన్నారు.

పెనుగొండ : సమ్మె శిబిరం వద్ద అంగన్‌వాడీలు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఎస్మా జిఒ కాపీలను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పెనుమంట్ర ప్రాజెక్టు లీడర్ కె.తులసి మాట్లాడారు. అనంతరం సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వరి, భవాని, ఉషశ్రీ, వరలక్ష్మి, హైమ, శ్రీదేవి, మణి పాల్గొన్నారు.

యలమంచిలి : యలమంచిలిలో సమ్మె శిబిరానికి ఐద్వా సంఘం సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకులు సరిపల్లి జయప్రభ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు జిల్లెళ్ల ప్రశాంతి, బాతిరెడ్డి సుగుణ, ముస్కాడి జయశ్రీ, లక్ష్మి, ఐద్వా నాయకులు రజిని, దేవి, శకుంతల, సుధారాణి, లక్ష్మి పాల్గొన్నారు.

ఉండి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమ్మె శిబిరం వద్ద అంగన్వాడీల సంఘం మండలాధ్యక్ష కార్యదర్శులు ఎం.చైతన్య, డి.సత్యవేణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు ఝాన్సీ, గడి కుసుమ, లలిత, శ్రీదేవి, ప్రేమలత, విజయకుమారి, అనురాధ, గోవింద కుమారి, రాజశ్రీ, లక్ష్మి, అరుణ, ఉషారాణి, భాను, గొల్లమ్మ, అన్నపూర్ణ, రోజా, కనకలక్ష్మి, వాణి, సుబ్బలక్ష్మి, రత్నం, వీరవల్లి వెంకటలక్ష్మి, కుసుమ పాల్గొన్నారు.

పోడూరు : పోడూరులో అంగన్వాడీలు సంతకాల సేకరణ చేశారు. అనంతరం సమ్మె సహాయ నిధి ఏర్పాటు చేసుకుని విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, కుమారి, జి.బేబి, కె.జగదీశ్వరి, పి.విమల పాల్గొన్నారు.

భీమవరంలో...

సిపిఎం సానుభూతిపరుడు ఏసుదాసు మృతి

ఏసుదాసు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతిపరుడు విప్పర్తి ఏసుదాసు (65) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఏసుదాసు మృతి చెందారన్న విషయం తెలుసుకున్న సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి ఏసుదాసు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ఏసుదాసు యువకుడిగా ఉన్న సమయంలో డివైఎఫ్ఐ ప్రజానాట్యమండలి వంటి సంఘాల్లో ఎంతో చురుగ్గా పని చేశారన్నారు. 1977-80 మధ్యకాలంలో జరిగిన చించినాడ పోరాటంలో ఆయన తండ్రి పెద్ద వెంకన్న, తల్లి లక్ష్మమ్మ జైలు పాలైనప్పటికీ మొక్కవోని ధైర్యసాహసాలతో ఏసుదాసు ఎంతో చైతన్యంతో పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. ఏసుదాసు మృతదేహాన్ని సిపిఎం నాయకులు గొల్ల ఏడుకొండలు, శ్రీనివాస్, చెల్లబోయిన వడ్డీకాసులు, మువ్వలపాటి ఆంజనేయులు, తెన్నేటి స్టాలిన్, కోరం వెంకటేశ్వరరావు, పల్లేరు వెంకటస్వామి సందర్శించి నివాళులర్పించారు.

అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీధర్, జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎంఎల్ఎ వాసుబాబు

గ్రామాలాభివృద్ధే వైసిపి లక్ష్యం

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాభివృద్ధే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తుందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, జెడ్‌పి చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఉంగుటూరు ఎంఎల్ఎ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని భువనపల్లిలో రూ.2.46 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచినీటి చెరువు తవ్వకాలు రూ.30 లక్షలతో చేపడుతున్నట్లు చెప్పారు. రూ.45 లక్షలతో సచివాలయాలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రూ.21 లక్షలతో కాపవరం కాలువ నుండి జగ్గయ్య మంచినీటి చెరువుకు పైపు లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శృంగవానికి రూ.21 లక్షలతో ప్రహరీ, అంతర్గత సీసీ రోడ్డు, రూ.37 లక్షల దాతల విరాళంతో నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రాన్ని, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కిలారి సత్యవతి, రవిబాబు, నిడమర్రు ఎంపిపి ధనుకొండ ఆదిలక్ష్మి, సూర్య బలిజ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, గణపవరం సర్పంచి మోర అలంకారం, భువనపల్లి ఉప సర్పంచి ఎల్లంకి నరేష్, ఎంపిడిఒ విజయకుమారి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విల్లాస్ ప్రాజెక్ట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు

సకల సౌకర్యాలకు నెలవు ఐరా విల్లాస్

శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

శ్రీయ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మాణం కానున్న ఐరా విల్లాస్ సకల సౌకర్యాలకు నెలవు అని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, డిసిసిబి చైర్మన్, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. భీమవరానికి అతి దగ్గరలో గొల్లలకోడేరులో శ్రీయ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్మాణం కానున్న ఐరా విల్లాస్ బ్రోచర్‌ను రాజకీయ ప్రముఖులు, కన్‌స్ట్రక్షన్ ప్రతినిధులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికి చిరునామా క్షత్రియ సోదరులని, ఈ ప్రాంతాలను అభివృద్ధి పరిచేందుకు ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు. భీమవరం జిల్లా కేంద్రమైన తర్వాత అభివృద్ధి మరింత శరవేగంగా జరుగుతుందన్నారు. శ్రీయ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో 200 ఐరా విల్లాస్ నిర్మించడం అభినందనీయమన్నారు. శ్రీయ కన్‌స్ట్రక్షన్ ప్రతినిధులు పెనుమచ్చ రామరాజు, సుమంత్‌వర్మ మాట్లాడుతూ అత్యంత ప్రమాణాలతో నూతన టెక్నాలజీతో ఈ విల్లాస్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఐరా క్లబ్, విశాలమైన ఆట స్థలం, ఫంక్షన్ హాల్, గార్డెన్ వంటివి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎటువంటి లాభాపేక్ష ఆశించకుండా ప్రామాణికంగా నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గోకరాజు రామరాజు, నెట్ క్యాప్ చైర్మన్ కెకె.రాజు, ఎంపిపి భూపతిరాజు చంద్రిరాజు, జెడ్‌పిటిసి సభ్యులు పెద్దిశెట్టి లక్ష్మీతులసి, సర్పంచి కుక్కల లక్ష్మి, వైసిపి ముఖ్య నేత కలిదిండి శ్రీనివాసవర్మ పాల్గొన్నారు.

సంతాపం తెలుపుతున్న నాయకులు

లక్ష్మీనారాయణ మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక మురా కార్మికుడు లక్ష్మీనారాయణ మృతి యూనియన్‌కు తీరని లోటని సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. స్థానిక బజారు మురా కార్మికుడు రుంకాని లక్ష్మీనారాయణ ఇటీవల మృతి చెందారు. స్థానిక ఐదో వార్డులోని లక్ష్మీనారాయణ స్వగృహంలో శనివారం బర్నాల అప్పలనాయుడు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. తొలుత లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. సుమారు 25 ఏళ్ల ఎగుమతి, దిగుమతులు కార్మికుడిగా పనిచేసి, యూనియన్ పట్ల అంకితభావంతో ఉన్న వ్యక్తి చనిపోవడం పట్ల పలువురు తమ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సంతాప సభలో పెంకి అప్పారావు, ఉర్రూతవల్లి రమణ, లోగలాపు రామకృష్ణ, గుడ్ల నాగరాజు, కుంచాడ బాబ్జీ, భోగరాజు, వెంపాటి నరసింహులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ రామరాజు

కాళ్లకూరులో ఆర్ఓ వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్లకూరు గ్రామ ప్రజలకు తాగునీటిని అందించేందుకు నీటిశుద్ధి ప్లాంటు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. కాళ్లకూరులోని ఉదిత ఆర్ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎంఎల్ఎ రామరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఆర్ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు తాగునీరు అందించేందుకు ముందుకు వచ్చిన అడ్డాల వారి కుటుంబాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి అడ్డాల శివరామరాజు, మంతెన పెదనరసింహరాజు, అడ్డాల సుబ్బరాజు, పివి.రామరాజు, అడ్డాల వెంకట్రాజు, సాయి శ్రీను, ఉప సర్పంచి నడింపల్లి ప్రదీప్‌రాజు, గాదిరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

బరులు సిద్ధం .. హైకోర్టు ఉత్తర్వులు బేఖాతరు..!

కోడిపందేల నిర్వాహకుల జోరు
తగ్గని పందెంరాయుళ్లు
అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలోనే నిర్వహణ
అక్కడక్కడా బరుల ధ్వంసం

వీరవాసరంలో పోలీసులు ధ్వంసం చేసిన బరి

ప్రజాశక్తి - వీరవాసరం

కోడిపందేల నిర్వహణపై హైకోర్టు ఉత్తర్వులను సైతం నిర్వాహకులు లెక్క చేయడం లేదు. కోర్టు పిటీషన్‌లో పేర్కొనని ప్రాంతాల్లో పందేల నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. మండలంలో నవుడూరు, మత్స్యపురి, మత్స్యపురిపాలెం, నందమూరు గరువు, అండలూరు, జొన్నలపాలెం గ్రామాల్లో పందేల నిర్వహణకు రంగం సిద్ధమైంది. అయితే ఈ బరులన్నీ వైసిపి నాయకుల ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నట్లుగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను బట్టి తెలుస్తోంది. కొణితివాడ, ఉత్తరపాలెంల్లో కోడి పందేలపై కోర్టులో పిటీషన్ వేయడంతో ప్రతి సంవత్సరం కొణితివాడలో నిర్వహించే బరి సమీప గ్రామమైన జొన్నపాలెంలో ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. పోలీసులు కూడా తూతూమంత్రంగా బరుల ధ్వంసం చేపడుతున్నా పెద్దఎత్తున పందేల నిర్వహణకు అధికార పార్టీ నేతలు ఏర్పాటు చేసిన బరుల జోలికి వెళ్లడం లేదని తెలుస్తోంది.

కాళ్ల : పశ్చిమగోదావరి జిల్లాలో కోడి పందేల జోష్ మొదలైంది. సంక్రాంతి పండుగ మూడ్రోజుల పాటు గతంలో పంట పొలాల్లో బరులు సిద్ధం చేసేవారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న వెంచర్లలో బరులు సిద్ధం చేయడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అధికార పక్షం నుంచి పందేలు నిర్వహించే వారికి అన్ని అండదండలు అందాయని తెలుస్తోంది. పందెం రాయుళ్ల అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు.

బరులు ఇప్పటికే సిద్ధం

ముందుగా ఎత్తుగా ఉన్న ఖాళీ స్థలాలను ఎంచుకుని బరి చుట్టూ ఫెన్సింగ్ వేయించారు. షామియానాలు, కుర్చీలు, రాత్రిపూట పందేల కోసం లైటింగ్ ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు పొలాలకు ఉండే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను ఉపయోగించుకుంటున్నారు. కరెంటు పోతే వెంటనే జనరేటర్ వేసే సౌకర్యం ఏర్పాటు చేసుకుంటున్నారు. అధికార పార్టీకి చెందిన నియోజకవర్గ నాయకుడు పెద అమిరం గ్రామంలో పెద్దఎత్తున కోడి పందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సీసలి గ్రామంలో ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎంఎల్ఎ తన సొంత స్థలంలో భారీ స్థాయిలో కోడిపందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దర్జాగా బరుల సిద్ధం చేస్తున్న పోలీసులు మాత్రం ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.

కోత ముక్క

కోడిపందేలకు అదనంగా కోతముక్క, లోపల, బయట, మూడు ముక్కలాటలు కూడా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వీటి ద్వారా కూడా బరి నిర్వాహకుడికి భారీగా ఆదాయం చేకూరుతుంది. అందుకే కోత ముక్క నిర్వహించే వారిని అనేక ప్రాంతాల నుంచి రప్పించారు.

పందెంరాయుళ్లు బరుల ఏర్పాట్లలో నిమఘ్నమయ్యారు. ఎప్పుడు గ్రీన్‌సిగ్నల్ వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. బరుల అనుమతి కోసం అధికార పార్టీ నేతల చుట్టూ కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు ప్రదక్షణలు చేస్తున్నారు.

పందెం.. రూ.పది లక్షలు

మండలంలోని పెదఅమిరం, సీసలి, జక్కరం, మాలవానితిప్ప తదితర గ్రామాల్లో పెద్ద బరులను ఏర్పాటు చేస్తారు. సీసలి బరిలో కోడిపందేలు ఒక రేంజ్‌లో సాగుతాయి. ప్రస్తుతం పెదఅమిరంలో భారీ స్థాయిలో కోడిపందేలు నిర్వహించేందుకు పందెం బరులు తయారు చేస్తున్నారు. ఈ బరిలో ఒక్కో పందెం రూ.మూడు లక్షల నుంచి రూ.10 లక్షల వరకు జరుగుతాయి. లోపల జరిగే పందెంకంటే బయట జరిగే పందేలు లక్షల్లో ఉంటాయి.

కోడిపందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు

పాలకొల్లు : పాలకొల్లు ప్రాంతంలో కోడిపందేలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో కోడిపందేలు నిర్వహించిన చోటే ఈసారి పందేలు నిర్వహిస్తున్నారు. పట్టణ శివారు పూలపల్లిలో వైసిపి, టిడిపి నేతలు బరులు సిద్ధం చేస్తున్నారు. గతేడాది గుండాట, పేకాటలకు అనుమతి లేకపోవడంతో పందెం నిర్వాహకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈసారి ఎన్నికల సమయం కావడంతో గుండాట, ఇతర జూదం యథాతథంగా ఉంటుందని నిర్వాహకులు భావిస్తున్నారు.


బరులు ధ్వంసం చేస్తున్న డిఎస్‌పి శ్రీనాథ్

కోడిపందేలను అడ్డుకుంటాం : డిఎస్‌పి శ్రీనాథ్

ఉండి : యువత జూద క్రీడల వైపు వెళ్లకుండా సాంస్కృతిక క్రీడల వైపు వెళ్లేందుకు అవగాహన సదస్సులను ప్రతి గ్రామంలో నిర్వహించాలని భీమవరం డిఎస్‌పి బండారు శ్రీనాథ్ అన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఎస్‌పి ఉప్పాడ రవిప్రకాష్ సూచనల మేరకు భీమవరం డివిజన్‌లో కోడిపందేలను అడ్డుకుంటామని, ఎవరైనా కోడిపందేలు నిర్వహించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. మండలంలోని చిన్నపుల్లేరు, మహదేవపట్నం గ్రామాల్లో బరులను శనివారం వారు ధ్వంసం చేశారు. ఆయనతో పాటు ఆకివీడు సిఐ కెవివిఎస్.సత్యనారాయణ, ఉండి పోలీసులు ఉన్నారు.

బరులు ధ్వంసం

ఆకివీడు : కోడిపందేల బరులను పోలీసులు ధ్వంసం చేశారు. మండలంలోని కుప్పనపూడి, తాళ్లకోడులో బరులను పోలీసులు ధ్వంసం చేశారు.

యలమంచిలి : మండలంలోని నార్నిమెరకలో కోడిపందేలు నిర్వహించడానికి సిద్ధం చేసిన బరులను యలమంచిలి ఎస్ఐ కాకి శివన్నారాయణ తన సిబ్బందితో కలిసి శనివారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కోర్టు ఆదేశాలను ఎవరైనా అతిక్రమించి కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు పోలీసు సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

పలుచోట్ల ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - కాళ్ల

మహిళలు పెద్ద ఎత్తున ముగ్గుల పోటీల్లో పాల్గొని తమలోని ప్రతిభను వెలికితీస్తూ రంగురంగుల ముగ్గులను ముచ్చటగా ప్రదర్శించారని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు సతీమణి మంతెన సుప్ర అన్నారు. మండలంలోని దొడ్డనపూడిలో సంక్రాంతి సందర్భంగా శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్ర మాట్లాడుతూ దొడ్డనపూడి గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు సహకారంతో భాస్కర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామ సర్పంచి సతీమణి కొల్లి దేవి పద్మజ మాట్లాడారు. పోటీల్లో విజేతలకు మంతెన సుప్ర చేతులమీదుగా బహుమతులు అందించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో కొల్లి దేవి పద్మజ, కొల్లి భాస్కర్, అరేటి ఛాయాదేవి పాల్గొన్నారు.

నేటి ఆటలు, ముగ్గుల పోటీలు

నరసాపురం టౌన్ : నరసాపురం డివిజన్‌లో ఈ నెల 14వ తేదీ నుంచి 18 వరకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘాల నాయకులు బొక్క దుర్గారావు, కవురు దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.పది వేలు, ద్వితీయ బహుమతి రూ.ఆరు వేలు, తృతీయ బహుమతి రూ.నాలుగు వేలు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

కాళ్లలో...

శశిలో సంక్రాంతి సంబరాలు

తాడేపల్లిగూడెం : తెలుగు వారి సాంప్రదాయక పండగ సంక్రాంతిని అందరూ ఆనందంతో సంతోషంగా జరుపుకోవాలని శశి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ అన్నారు. శశి కళాశాలలో విద్యార్థులు రంగవల్లికలు, బొమ్మల కొలువు, సంప్రదాయక వస్త్రధారణతో సంక్రాంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల రంగవల్లులు వేసిన విద్యార్థులను వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్ అభినందించారు.

గ్రామీణ క్రీడాకారులు అభివృద్ధి చెందాలి

గణపవరం : గ్రామీణ క్రీడాకారులు అభివృద్ధి చెందాలని జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలోని కొమ్మర, ఎస్.కొండేపాడులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు అభివృద్ధి చెందడానికి ప్రతిఒక్కరూ ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తోట శ్రీను, తోట పవన్, పి.జోగేశ్వరరావు, మారిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

గణపవరంలో...

చిరస్మరణీయులు మెల్విన్ జోన్స్

తాడేపల్లిగూడెం : అంతర్జాతీయ లయన్స్ క్లబ్ స్థాపించి కోట్లాది మందికి సేవలందిస్తున్న లయన్ మెల్విన్ జోన్స్ చిరస్మరణీయుడు, స్ఫూర్తి ప్రదాత అని లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య అధ్యక్షతన స్థానిక బృందావనం వద్ద మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యర్రగుడిపల్లి ప్రేమాలయంలో క్లబ్ ఫస్ట్ కొనా శ్రీనివాస్ సహకారంతో పౌష్టికాహారం, లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోమ్‌లో బెడ్ షీట్లు, పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమంలో డైమండ్స్ లయన్స్ క్లబ్ సభ్యులు సెక్రటరీ మద్దుకూరి మెహర్‌ప్రసాద్, కుందురు వెంకటేశ్వరరావు, ఆంజనేయస్వామి, జామి సత్యనారాయణ, సత్యనారాయణరాజు, కలవలపల్లి సత్యనారాయణ, పాండు రంగారావు, అభయం లియో లయన్స్ అధ్యక్షులు మాధురి, వాడపల్లి మంగా దేవి, వలిపి చైర్మన్ లియో క్లబ్ సింధు శ్యామల, పి.శిరీష, రెడ్డినందిని, నక్కా అంబికా పాల్గొన్నారు.

104 వాహనం తనిఖీ

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండలో సచివాలయం-1లో 104 వాహనాన్ని డిజిటల్ మేనేజర్ వైఎస్ఎన్.మూర్తి శనివారం తనిఖీ చేశారు. వాహనంలో పరికరాలు, మందులు, పలు అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 వాహనం సేవలను ప్రజలు మరింతగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు 104 వాహన సేవలను ఉపయోగించుకునేలా ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ వర్ధప్రసాద్, పైలెట్ ప్రకాష్, ఆశాలు, ఎఎన్ఎంలు, సిహెచ్‌ఒలు ధనమ్మ, సత్యవేణి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - గణపవరం (నిడమర్రు)

నిడమర్రు మండలంలోని మందలపర్రులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... నిడమర్రు మండలంలోని మందలపర్రులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బంది శనివారం దాడి చేశారు. ఈ దాడిలో పది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నగదు స్వాధీనం

ఉండి : మండలంలోని వాండ్రంలో పేకాట స్థావరంపై ఉండి ఎస్ఐ ఆకాశ్ సూర్యనారాయణ తన సిబ్బందితో శనివారం దాడి చేశారు. ఈ దాడిలో పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.73,070 నగదును స్వాధీనం చేసుకున్నారు.

సిహెచ్‌సిలో అత్యవసర విభాగం ప్రారంభం

అత్యవసర విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

పేదలకు సేవ చేయడం ద్వారా పొందే ఆనందం వైద్యులకు ఎంతో మానసిక సంతృప్తినిస్తుందని ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో నాబార్డ్ నిధులు రూ.82 లక్షలతో నిర్మించిన అత్యవసర విభాగాన్ని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నామన్నారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా పేదల ఇళ్ల వద్దకే వైద్యులు వెళ్లి ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.సూర్యనారాయణ, సూపరింటెండెంట్ డాక్టర్ వి.శివరంజని, వైద్యాధికారులు దిగుపాటి జితేంద్ర, విజయలక్ష్మి రమ్యశ్రీ రామాంజనేయులు, సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు, సుంకర సీతారాం, జక్కంశెట్టి పండి, గణేశుల శేషమణి సుబ్బారావు, ఉపసర్పంచి అభివృద్ధి కమిటీ చైర్మన్ నల్లూరి శరత్‌చంద్ర, సభ్యులు దొమ్మేటి రాంబాబు, మరియమ్మ నాగబాబు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్లో 1996-2001 వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక శనివారం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. 26 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా వారి వారి యోగ క్షేమాలు తెలుసుకుంటూ గడిపారు.

గురువును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నాసిరకం రాళ్లు వాడడం వల్లే జారిన ఏటిగట్టు

మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం గోదావరి ఏటిగట్టు కొట్టుకుపోవడానికి ఎంఎల్ఎ ప్రసాదరాజు కారణమని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు అన్నారు. నాసిరకం రాళ్లను వాడటం వల్లే ఏటిగట్టు కొట్టుకుపోతుందన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గతేడాది ఆగస్టులో గవర్నర్ నుంచి సబ్ కలెక్టర్ వరకు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. అవినీతిలో పనుల్లో అధికారులు ఎంఎల్ఎతో కుమ్మక్కయ్యారన్నారు. రాళ్ల నాణ్యతపై సమర్పించింది బోగస్ క్వాలిటీ సర్టిఫికెట్ న్నారు. గత ప్రభుత్వ హయాంలో తిరస్కరించిన క్వారీ నుంచి రాళ్లు వాడారన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. రూ.కోట్ల అవినీతికి పాల్పడిన ఎంఎల్ఎ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నరసాపురం అభివృద్ధి కన్నా ఎంఎల్ఎకు తన వ్యక్తిగత లబ్ధే ముఖ్యమన్నారు. నరసాపురం అభివృద్ధి కోసం పనులకు సిఎం శంకుస్థాపన చేసి 14 నెలలు గడిచినా కనీసం ఒక్క పని కూడా మొదలు కాలేదన్నారు. ఈ నెల 20 లోపు ఎంఎల్ఎ ఏటిగట్టు పనుల అవినీతిపై స్పందించకపోతే 21వ తేదీ నుంచి ప్రజాఉద్యమం చేపడతామని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని చూపిస్తున్న పత్రాలు భోగి మంటల్లో వేసే కార్యక్రమం చేపట్టాలన్నారు.

గ్రామాల్లో బసవన్నల సందడి

ఆకట్టుకుంటున్న గంగిరెద్దుల విన్యాసాలు

ప్రజాశక్తి - యలమంచిలి

సంక్రాంతి సమీపిస్తున్న వేళ గ్రామాల్లో గంగిరెద్దుల సందడితో పండుగ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో గంగిరెద్దులను ఆడించేవారు వాటితో చేసే విన్యాసాలను తిలకిస్తున్న చిన్నారులు ఆనందంతో కేరింతలు కొడుతూ మంత్ర ముగ్ధులవుతున్నారు. పూర్వకాలంలో సంక్రాంతి వస్తే చాలు వారం రోజుల ముందుగానే గ్రామాల్లో పదుల సంఖ్యలో గంగిరెద్దులు, హరిదాసుల కోలాహలం కనిపించేది. రాను రాను గంగిరెద్దులను ఊరేగించే సాంప్రదాయం కనుమరుగైన పరిస్థితుల్లో మళ్లీ ఇటీవల గంగిరెద్దులను ఆడించేవారు అక్కడక్కడా తారస పడడంతో పాటు వీరు డోలు సన్నాయిలతో లయబద్ధంగా మోగించే వినసొంపైన పాటలకు గంగిరెద్దులు సైతం నాట్యం చేస్తూ ఆకట్టుకోవడంతో గ్రామాల్లో ప్రస్తుతం సంక్రాంతి ముందే వచ్చిందా అన్న విధంగా సందడి వాతావరణం మొదలైంది.

అంబేద్కర్ విగ్రహాన్ని 26న ఆవిష్కరించాలి

దళితుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్‌రావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విజయవాడ స్వరాజ్ మైదానంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని సామాజిక న్యాయ మహా శిల్పంగా నామకరణం చేసి నిర్మించడం సంతోషకరమని దళితుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కలింగ లక్ష్మణ్‌రావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహం ఈ నెల 19వ తేదీన కాకుండా రాజ్యాంగం ఆమోదం పొందిన రోజు గణతంత్ర దినోత్సవం రోజు రాజ్యాంగ నిర్మాతకు గౌరవం దక్కేలా జనవరి 26వ తేదీన ప్రారంభించాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఈ విషయంలో ఒకసారి ఆలోచించాలని అంబేద్కర్ వాదులుగా, ప్రజాసంఘ నాయకులుగా కోరుకుంటున్నారని చెప్పారు.

నేడు గంట్లమ్మ జాతర ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం ఆరో వార్డులో ఉన్న గంట్లమ్మ జాతర ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభమవుతుందని పొన్నపల్లి కోదండ రామాలయ ధర్మకర్త తమ్ము లీలా ప్రసాద్, కౌన్సిలర్ మల్లాడి బుజ్జి, గంట్లమ్మ ఆలయ ధర్మకర్త బొడ్డు కృష్ణ భగవాన్, గంట్లమ్మ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తిరుమాని స్వామి, తిరుమాని సుబ్బారావు, గాడి శ్రీను, మూపితి శ్రీరాములు, కోలా కష్ణ, నాటిన రాంబాబు, గణేష్ యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. పొన్నపల్లిలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గంట్లమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 3వ తేదీన స్టీమర్ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన పూరి గుడిసెలో అమ్మవారిని నిలబెట్టి 7న గ్రామోత్సవం నిర్వహించామన్నారు. 14వ తేదీన గంట్లమ్మ ప్రారంభ జాతర ఉంటుందన్నారు. గంట్లమ్మ పెద్ద జాతరను ఈ నెల 31వ తేదీ రాత్రి పొన్నపల్లి గంట్లమ్మ ఉత్సవ కమిటీ, వలకట్ల సంఘం, గణేష్ యూత్ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు.

మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మావుళ్లమ్మ 60వ జాతర మహత్సవాలను ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో దేవదాయశాఖ సహకారంతో గత 60 సంవత్సరాలుగా ఈ ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు. యాత్రికుల కోసం ఆర్‌టిసి శాఖ ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ వై.భద్రాజీ, పాలకవర్గ చైర్మన్ మానేపల్లి నాగన్నబాబు, ఎంపిపి పేరిచర్ల విజయనరసింహరాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, ఎఎస్.రాజు, ఉత్సవ కమిటీ నాయకులు రామాయణం గోవిందు, కొప్పుల సత్తిబాబు, తూటారపు ఏడుకొండలు, రామాయణ సత్యనారాయణ, నరహరిశెట్టి అబ్బులు, రామాయణం శ్రీను, ఆకుల సోమన్న, కొప్పుల రాంబాబు పాల్గొన్నారు.

ఆలయంలో అతిథి గృహాలు ప్రారంభం

ప్రజాశక్తి పెనుగొండ

పెనుగొండ నగరేశ్వరి స్వామి ఆలయంలో రూ.1.50 కోట్ల సిజిఎఫ్ నిధులతో నిర్మించిన 16 అతిథి గృహాలను, హాలును ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఆలయంలో అన్నదానం అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చెక్కు పోయినది

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అమరావతి బ్రాంచ్, చెక్కు నెం. 807249, Dt. 08-02-2021 CMRF చెక్కు నుంచి రిలీజైన చెక్కు ఇచ్చిన తేదీ, అమౌంట్ రూ. 1,10,000/-లు ది. 10-01-2024వ తేదీన మారంపల్లి నుంచి ద్వారకాతిరుమల జిరాక్స్ నిమిత్తం తీసుకు వెళుతుండగా దారిలో పడిపోయినది. కావున ఎవరికైనను దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియపరచవలెను.

సుధాకర్ నాదెళ్ల
మారంపల్లి, సెల్: 9505785084